క్లుప్తంగా

ఉద్యోగం సాధించిన గోపికి సన్మానం



గోపిని సన్మానిస్తున్న యువకులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డ మాచవరం గ్రామానికి చెందిన చింతలచెరువు గోపి ఇటీవల టీజీపీఎస్సీ విడుదల చేసిన ఫలితాల్లో పంచాయతీరాజ్ శాఖ ఏఈఈగా ఉద్యోగం సాధించాడు. అంతేకాకుండా మూడు సంవత్సరాల కాలంలో ఏడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. దీంతో గోపిని గ్రామానికి చెందిన యువకులు, గ్రామ పెద్దలు సోమవారం రాత్రి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో యువకులు, తదితరులు ఉన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ మండల కమిటీ ఎన్నిక



కృష్ణారెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా నాయకులు

గరిడేపల్లి : మండల కేంద్రంలో సోమవారం పీఆర్‌టీయూ టీఎస్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి చింతరెడ్డి రామలింగారెడ్డిల ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎర్ర కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బొంత సైదిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా మేకల సందీప్‌కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలిగి ఎం.సువర్ణ, కార్యదర్శిగా శంకర్‌రావు, మహిళా కార్యదర్శిగా జి. శిరీషలను ఎన్నుకున్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి



పంతులునాయక్ (ఫైల్)

చిలుకూరు : మండలంలోని జానకీనగర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ బాణోతు పంతులు నాయక్(85) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. గత సర్పంచ్ ఎన్నికల్లో పంతులునాయక్ ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆయన మృతి పట్ల మాజీ జెడ్పీటీసీ భట్టు శివాజీనాయక్, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌కు సత్కారం



ఎస్‌ఐని సన్మానిస్తున్న వేమూరి సత్యనారాయణ, గ్రామస్తులు

మునగాల : బోనాల పండుగను పురస్కరించుకొని సోమవారం మునగాల మండలంలోని నరసింహాపురం గ్రామానికి వచ్చిన మునగాల నూతన ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్‌ను సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ వేమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో శాలువాతో గ్రామ పెద్దలు సత్కరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువత పాల్గొన్నారు.

దోమల నివారణకు సొంత ఖర్చుతో ఫాగింగ్



బూరుగడ్డలో ఫాగింగ్ చేపడుతున్న యరగాని నాగరాజు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గత నెల రోజులుగా విష జ్వరాల ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో దోమల నివారణకు గ్రామానికి చెందిన యువకుడు యరగాని నాగరాజు తన సొంత ఖర్చుతో ఆదివారం రాత్రి అన్ని వీధుల్లో ఫాగింగ్ చేపట్టినట్లు ఆయన తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య లోపంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కాగా, గ్రామ పంచాయతీలో నిధుల లేకపోవడంతో ఫాగింగ్ చేపట్టలేకపోతున్నామని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన చిలక జానయ్య ఇటీవల మృతి చెందాడు. సోమవారం మృతుని కుటుంబానికి కటకం జోగయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కటకం వేణు రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కటకం వేణు, చామకూరి సుధాకర్, మన్నెం వేణు, పోలంపల్లి సురేష్, పిచ్చయ్య, రమేష్, సైదులు, నాగరాజు, వినోద్, మహేష్, ముసలి, కార్తీక్, గౌతమ్, సంజయ్ పాల్గొన్నారు.

అధ్వానంగా 'ఎస్సారెస్పీ' కాల్వలు



సర్వారం పరిధిలోని 22 ఎల్ కాల్వలో ఉన్న కంప చెట్లు



కరక్కాయలగూడెం వద్ద ఇలా..

- కాల్వల్లో దట్టంగా పెరిగిన చెట్లు
- మరమ్మతులు చేపట్టి ఆయకట్టు చివరకు నీరందించాలని రైతుల వేడుకోలు

మోతె : మండలంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండవ దశ చివరి ఆయకట్టు పరిధిలోని కాల్వలు చిట్టడవులను తలపిస్తున్నాయి. సాగుకు గోదావరి జలాలు అందించాలనే సదుద్దేశంతో జిల్లాలో ఎస్సారెస్పీ కాల్వలు తవ్వి దాదాపు రెండు దశాబ్దాలు కావస్తున్నా కోదాడ నియోజకవర్గంలోని మోతె మండలంలో 30 వేల ఎకరాలు కలిగిన చివర ఆయకట్టుకు ఏనాడు నీరు సమృద్ధిగా అందిన పాపాన పోలేదు. మండలంలో రావిపహాడ్ నుంచి సర్వారం, కరక్కాయలగూడెం, అన్నారిగూడెం గ్రామాల నుంచి వెళ్లే ఎల్ -22 కాల్వలో దట్టంగా చెట్లు మొలిసి అడవులను తలపిస్తున్నాయి. 71 డీబీఎం ప్రధాన కాల్వ మినహా జిల్లాలోని మూడు నియోజకవర్గాలు సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ పరిధిలో సాగు నీరందించే ఉప కాల్వలు, పిల్ల కాల్వలను ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోలేదు. జిల్లాలో 71 డీబీఎంకు అనుసంధానంగా నిర్మించిన 36 ఎల్, 22 ఎల్ ఉప కాల్వలు వాటికి అనుసంధానంగా తవ్విన పిల్ల కాల్వలు ఉన్నాయి. తిరుమలగిరి నుంచి వచ్చే 36 ఎల్ కాల్వ సూర్యాపేట నియోజకవర్గంతో పాటు చివరన ఉన్న కోదాడ నియోజకవర్గంలోని మోతె మండలంలో గల 30 వేల ఎకరాల సాగు భూముల తో పాటు మునగాల, నడిగూడెం మండలాల పరిధిలోని పలు గ్రామాలకు గోదావరి జలాలు అందించాల్సి ఉంది. గత ప్రభుత్వం పాలనలో కూడా ఎస్సారెస్పీ జలాలను చివరి ఆయకట్టు అయిన కోదాడ నియోజకవర్గంలోని భూములకు అందిస్తామని నాటి సీఎం చెప్పినా అది కార్యరూపం దాల్చలేదు.

ఆనవాళ్లు కోల్పోయిన కాల్వలు..

ఎస్సారెస్పీ కాల్వలు తవ్విన నాటి నుంచి మరమ్మతులకు నోచుకోకపోవడంతో అవి ఆనవాళ్లు కోల్పోయాయి. లైనింగ్ సరిగా లేదు. తూములకు షట్టర్లు మాయమయ్యాయ. కాల్వల్లో మట్టి పేరుకుపోయింది. కాల్వలు కంపచెట్లమయం అయ్యాయి. ఇటువంటి దుస్థితిలో ఉన్న ఈ కాల్వల్లోకి వచ్చే ప్రస్తుత సీజన్‌కు సాగు నీళ్ల వదిలితే చివరి వరకు ఎలా పారుతాయని రైతులు ప్రశ్నిస్తున్నారు. యుద్ధప్రాతిపదిక కాల్వల మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి

ఎస్సారెస్పీ కాల్వల్లో దట్టంగా మొలిసిన కంప చెట్లను తొలగించి, మరమ్మతులు చేపట్టాలి. ఎస్సారెస్పీ సాగు నీరు చివరి ఆయకట్టు వరకు చేరాలంటే ప్రభుత్వం కాల్వల్లో పూడిన మట్టిని తొలగించాలి. కాల్వల నిర్వహణకు లస్కర్లను నియమించి నీళ్ల చివరి ఆయకట్టు వరకు చేరేలా చర్యలు తీసుకోవాలి.

– కోట మధుసూదన్‌రెడ్డి, రైతు, రావిపహాడ్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



హుజూర్‌నగర్‌రూరల్ : గోపాలపురం గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ



కోదాడరూరల్ : నల్లబండగూడెంలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నిరంజన్

హుజూర్‌నగర్‌రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నిరంజన్ సూచించారు. సోమవారం హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురంలో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి ఫీవర్ సర్వేను మెడికల్ అధికారి డాక్టర్ కళ్యాణితో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలంలో పారిశుద్ధ్య లోపం కారణంగా అధికంగా దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నందున ప్రజలు తమ ఇంటి పరిరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. జ్వరం వచ్చిన వారు వైద్య సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

నల్లబండగూడెంలో ఫీవర్ సర్వే..

కోదాడరూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రంజిత్‌కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని నల్లబంగూడెంలో అనంతగిరి పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న రోగుల రక్తనమునాలు సేకరించి చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. నీరు నిల్వలేకుండా, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ ఉపేందర్, పీహెచ్‌ఎస్ అనంతలక్ష్మి, సూపర్‌వైజర్ ఉమామహేశ్వరి, సిబ్బంది యాతాకుల మధుబాబు, నరసింహ, పరమేశ్వరి, గోపమ్మ, కార్యదర్శి అరుణ ఉన్నారు.

గ్రామ పంచాయతీల రికార్డులు తనిఖీ



మఠంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ హరిసింగ్

మఠంపల్లి : మండల కేంద్రంతో పాటు కాల్వపల్లి తండా గ్రామ పంచాయతీ కార్యాలయాల రికార్డులను సోమవారం ఎంపీడీఓ హరిసింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రికార్డుల నిర్వహణను కార్యదర్శులు సక్రమంగా చేపట్టాలని సూచించారు. అదేవిధంగా పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ఫాగింగ్, తదితర పనులను ఆయన పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి విజయక్రాంతి, కంప్యూటర్ ఆపరేటర్ నరసింహారావు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది కోటిరెడ్డి, పంచాయతీ సిబ్బంది మైసయ్య, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

నడిగూడెం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్ అన్నారు. సోమవారం నడిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో వైద్యాధికారులు, సిబ్బందితో విష జ్వరాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో త్రిపురవరం ప్రాథమిక వైద్యాధికారి లక్ష్మీప్రసన్న, వైద్యులు విద్యాసాగర్, హరినాథ్, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అల్లం ఉమారాణికి ఘన నివాళి



ఉమారాణి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాగన్నగౌడ్, తదితరులు

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, ఉమ్మడి నల్గొండ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, న్యాయవాది అల్లం ప్రభాకర్‌రెడ్డి సతీమణి ఉమారాణి మృతదేహాన్ని సోమవారం హుజూర్‌నగర్‌లో పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు, మాజీ జెడ్పీటీసీ గల్లా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ విజయ వెంకన్న, నాయకులు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి, సీహెచ్.రాము, న్యాయవాదులు, తదితరులు ఉమారాణి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు.

సీపీఐ నాయకుల నివాళి..

ఉమారాణి మృతదేహాన్ని సీపీఐ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, దేవరం మల్లీశ్వరి, నాయకులు తదితరులు ఉన్నారు.

నారాయణకు నివాళి



నారాయణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

చిలుకూరు : మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి కట్టెకోల నారాయణ మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ గన్నా చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం కట్టెకోల నారాయణ గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సీపీఐ నాయకులు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ సీనియర్ నాయకులు దొడ్డా నారాయణరావు, గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండా కోటయ్య, మండల అధ్యక్షుడు కట్టెకోల నాగేశ్వరరావు, చిలువేరు ఆంజనేయులు, దొడ్డా రమేష్, దొడ్డా నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

చినుకు పడితే చిత్తడిగా దారి



బురదమయంగా పుర్లకుంట రోడ్డు

మఠంపల్లి : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ నుంచి పలు సిమెంట్ పరిశ్రమలు, పొలాలకు వెళ్లే పుర్లకుంట రోడ్డు చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. దీంతో ప్రతినిత్యం పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో వాహనాలతో పాటు బాటసారులు నడిచి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అయినా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పరిశ్రమ అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ దారిని సీసీ లేదా బీటీ రోడ్డుగా మార్చాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కాల్వల్లో కంపచెట్లు తొలగించాలి

మిర్యాలగూడ : సాగర్ కాల్వల్లో కంపచెట్లను తొలగించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం మిర్యాలగూడ మండలంలోని గూడూరు గ్రామ శివారులో ఉన్న కిష్టాపురం మేజర్ కాల్వను ఆయన పరిశీలించి మాట్లాడారు. గత ఏడాది వర్షాలు లేక సాగునీరు అందకపోవడంతో కాల్వలో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగాయన్నారు. ప్రస్తుతం సాగునీటిని విడుదల చేసినప్పటికీ కాల్వల్లో పూడిక తీయకపోవడంతో కాల్వ చివరి ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాగునీరు వస్తుందన్న ఆశలో రైతులు పంటను సాగు చేసుకుంటున్నారని వెంటనే కాల్వను శుభ్రం చేసి కాల్వకు నీరందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆయన సీఈ నాగేశ్వర్‌రావు, ఈఈ లక్ష్మణ్‌నాయక్‌లకు సమస్యను వివరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు జగదీశ్చంద్ర, రాగిరెడ్డి మంగారెడ్డి, రవినాయక్, పిల్లుట్ల సైదులు, బాలాజీనాయక్ పాల్గొన్నారు.

దశరథ మృతి సీపీఎంకు తీరని లోటు



దశరథ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మునగాల : మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు ముంత దశరథ మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందిన దశరథ దశదినకర్మ సందర్భంగా గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి నందిగామ సైదులు అధ్యక్షతన నిర్వహించిన సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. తొలుత దశరథ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి, ఎం.ముత్యాలు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు షేక్ సైదా, మాజీ సర్పంచ్ రావులపెంట వెంకన్న, నాయకులు రావులపెంట బ్రహ్మం, రేఖ లింగయ్య, నిడిగొండి శంభయ్య, ములకలపల్లి సైదులు, ఇంటూరి హుస్సేన్, ములకలపల్లి నాగరాజు, అక్తర్ పాషా, వెంపటి వీరబాబు, బూత వెంకన్న, వెంపటి బ్రహ్మం, ముంత సైదులు, ముంత రాములు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తుల ఆహ్వానం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ ఎంపీ లక్ష్మణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు నేటి నుంచి 20 రోజుల్లో దేవాదాయ, ధర్మాదాయ శాఖ హైదరాబాద్, నల్లగొండ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శ్రీవేణుగోపాలస్వామి దేవాలయానికి..

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గల శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయ ధర్మకర్తల మండలి (పాలకవర్గ సభ్యులు) ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ దేవాదాయ, ధర్మాదాయ శాఖ సోమవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆలయ ఈఓ ఎంపీ లక్ష్మణ్‌రావు స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఆసక్తి గలవారు 20 రోజుల్లో దరఖాస్తు పత్రాలను హైదరాబాద్ లేదా నల్లగొండలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. పూర్తి వివరాలకు ఆలయ ఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

చింతలపాలెం మండలంలో ఆలయాలకు..

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెంలోని శ్రీఉమామహేశ్వర, ఆంజనేయ స్వామి ఆలయం, వెల్లటూరులోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయాల నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆలయాల ఈఓ లక్ష్మణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఇరవై రోజుల్లో తమ దరఖాస్తులను నల్లగొండ, హైదరాబాద్‌లలోని దేవాదాయ శాఖ అధికారుల కార్యాలయాల్లో అందజేయాని ఆయన కోరారు.

108 వాహనం పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

మునగాల : మునగాల మండలానికి ప్రభుత్వం 108 వాహనాన్ని సోమవారం పునరుద్ధరించింది. గతంలో మండలానికి ఉన్న 108 వాహనాన్ని ప్రభుత్వం రద్దు చేయడంతో సకాలంలో వైద్యం అందక ప్రజలు ఇబ్బందులు పడుతుండడంపై ఈనెల 10న సాక్షి దినపత్రికలో ‘సకాలంలో వైద్యం అందేదెలా?’ అనే శీర్షికతో వచ్చిన కథనానికి జిల్లా వైద్యాధికారి స్పందించి వాహనాన్ని పునరుద్ధరించారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త గంధం సైదులు 108 వాహనాన్ని పునరుద్ధరించాలని స్థానిక ఎమ్మెల్యే పద్మావతి, జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేసినట్లు ఆయన తెలిపారు. కాగా, మండల కేంద్రంలో 108 వాహన సిబ్బందికి వసతి సౌకర్యం లేకపోవడంతో బరాఖత్‌గూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో అంబులెన్స్‌తో పాటు సిబ్బంది ఉండేవిధంగా అధికారులు ఏర్పాట్లు చేయడంతో సోమవారం 108 వాహనం బరాఖత్‌గూడెం చేరుకుంది. దీంతో అంబులెన్స్‌కు కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు ఓరుగంటి రవి, సామాజిక కార్యకర్త గంధం సైదులు, రాయిల సతీష్, బోనాల శ్రీధర్, శ్రీను స్వాగతం పలికారు. 108 వాహనం పునరుద్ధరణకు సహకరించిన ఎమ్మెల్యే, మంత్రి, జిల్లా కలెక్టర్‌కు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.



బరాఖత్‌గూడెం గ్రామపంచాయతీకి చేరుకున్న అంబులెన్స్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

క్రీడలకు సమయం కేటాయించాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్

- సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్

హుజూర్‌నగర్ : మానసిక ఒత్తిడిని తట్టుకునేందుకు ప్రతిరోజు కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రికెట్ పోటీలను సోమవారం పట్టణంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాముల రామిరెడ్డి, జక్కుల వీరయ్యలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. క్రీడలతో పని ఒత్తిడి తగ్గి రోజంతా ఉత్సాహంగా ఉంటారన్నారు. కాగా క్రికెట్‌తో పాటు చెస్, క్యారమ్స్, షటిల్ తదితర పోటీలను కూడా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గేమ్స్ సెక్రటరీ వెంకటేష్‌నాయక్, పలువురు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు



గ్రామంలో ఇంటింటి సర్వే చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది, కార్యదర్శి



చెత్తాచెదారంతో నిండిన మురుగుకాలువలు

- వారం రోజుల్లో సుమారు 20మందికి పైగా బాధితులు
- వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని జ్వరపీడితుల వేడుకోలు

మునగాల : మండల పరిధిలోని ఆకుపాముల గ్రామపంచాయతీ పరిధిలో వారం రోజులుగా విష జ్వరాలు విజృంభించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య లోపంతో దోమలు ఉధృతి ఎక్కువ కావడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వారం రోజులుగా సుమారు 20మందికిపైగా విషజ్వరాల బారిన పడి స్థానిక ఆర్ఎంపీలు, కోదాడ, ఖమ్మం పట్టణాల లోని ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం చేపట్టినప్పటికీ గ్రామంలో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్యం పనులు చేపట్టలేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టి ఉన్నతాధికారులకు పూర్తి సమాచారం ఇవ్వడం లేదనే విమర్శలు వస్తున్నాయి. విష జ్వరాల బారిన పడిన వారు ఆసుపత్రులలో వైద్య ఖర్చులు భరించలేక నానా యాతన పడుతున్నారు. గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి విషజ్వరాల బారిన పడిన వారిని గుర్తించి వారికి వైద్యసేవలు అందించాలని, మెరుగైన వైద్యచికిత్స కోసం ఏరియా ఆసుపత్రికి తరలించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

వైద్యశిబిరం ఏర్పాటు చేయాలి



గ్రామంలో పలువురు విష జ్వరాల బారిన పడి చికిత్స పొందుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స ఖర్చులు భరించలేక పేదవర్గాల వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి చికిత్సలు అందించాలి.

– జిల్లేపల్లి గోపి, సామాజిక కార్యకర్త, ఆకుపాముల

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం



మాట్లాడుతున్న ఫీల్డ్ ఆఫీసర్ సాయి

గరిడేపల్లి : నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగు చేస్తే అధిక ఆదాయం పొందవచ్చని హుజూర్‌నగర్ డివిజన్ పతంజలి ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ సాయి అన్నారు. సోమవారం గరిడేపల్లి మండల పరిధిలోని కుత్బుషాపురం గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని నేలలు ఆయిల్‌పామ్ సాగుకు అనువైనవన్నారు. రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుని ఆయిల్‌పామ్ తోటలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని కోరారు. ఈ పంటకు కూలీ ఖర్చులు తక్కువ, కోతుల బెడద లేదన్నారు. ఆయిల్‌పామ్ పంటను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు, ప్రభుత్వం నియమించిన కంపెనీ వారే కొనుగోలు చేస్తారని అన్నారు. కార్యక్రమంలో పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ సహాయకులు సాయికమల్, బి.రవితోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

అపహరణకు గురైన సెల్‌ఫోన్ అందజేత

సూర్యాపేట రూరల్ : రెండు రోజుల క్రితం సెల్‌ఫోన్ అపహరణకు గురైందని జాటోతుతండాకు చెందిన నాగునాయక్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి సెల్ ఫోన్‌ను గుర్తించారు. ఎస్ బాలునాయక్ సోమవారం బాధితుడు నాగు నాయక్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిించి అతడికి ఫోన్‌ను అప్పగించారు. ఆయన వెంట సిబ్బంది ఉమామహేశ్వర్, బాబు, రమేష్, రవి, అస్గర్ తదితరులు ఉన్నారు.